
సాయుధ పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తోంది
● సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు
1

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



'డబుల్' ఇళ్లలో లబ్ధిదారులే నివాసముండాలి

● కలెక్టర్ హైమావతి

సిద్దిపేట సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఎంపిక చేసిన లబ్ధిదారులు మాత్రమే నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో డబుల్ ఇళ్ల మంజూరు, లబ్ధిదారులకు అప్పగింత, ఇతర ప్రగతి పనులపై తహసీల్దార్, మున్సిపల్, హౌసింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో డబుల్ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇళ్లు అందించకపోవడం, డబుల్ ఇళ్లు మంజూరు కాకుండా వేరేవాళ్లు ఆక్రమించినట్లుగా దృష్టికి వచ్చిందని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు కాకుండా ఇతరులు ఉన్నట్లయితే వెంటనే వారిని ఖాళీచేయించి, తిరిగి అసలైన లబ్ధిదారులకు అప్పగించి, మిగిలిన ఇళ్లను అధికారులు ఆధీనంలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు వెంటనే ప్రైస్ మానిటరింగ్ కమిటీలను నియమించి, ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయడానికి అధికారులు ప్రతి గ్రామంలో ఇళ్ల నిర్మాణాలు, ఎలక్ట్రీషియన్లు, పెయిటింగ్, ప్లంబింగ్‌కు స్కిల్ లేబర్‌లు కొంత మందిని ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చినట్లయితే నిర్మాణాలను పూర్తి చేయగలుగుతామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, డీఆర్డీవో జయదేవ్ ఆర్య, సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ ఆర్డీఓలు సదానందం, రామ్మూర్తి, చంద్రకళ, తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్లు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

సంగారెడ్డి ఐఐటీ, పట్టణంలోని హెచ్‌ఎండీఏ పరిధిలో చెరువులను

బైక్‌పై తిరుగుతూ పరిశీలించిన జగ్గారెడ్డి, నిర్మల

రూ.2500 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేస్తే సీఎం రేవంత్‌రెడ్డికి ఇస్తానని అధికారులకు సూచన

ప్రతీ చెరువు వద్ద 25 మీటర్ల కట్ట వెడల్పు, నెక్లెస్ రోడ్డు, వాకింగ్ ట్రాక్, దోభీ ఘాట్, బతుకమ్మ ఘాట్, లైటింగ్, బోటింగ్, చేపలు పట్టేందుకు తగిన సౌకర్యాలు, చిల్డ్రెన్ పార్కు ఏర్పాటు చేయాలని సూచన

ఇళ్లు కూల్చకండి.. చెరువులను కాపాడండి

బలవంతంగా భూములు సేకరించకండి.. రైతులు ఇష్టపూర్వకంగా ఇస్తే తీసుకోండి

హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులకు చెరువుల వారీగా సూచనలు

30 కిలోమీటర్లు బైకుపై నిర్మలతో కలిసి బైక్ ప్రయాణం

15 చెరువులను పరిశీలించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ఐఐటీ, సంగారెడ్డి పట్టణంలోని హెచ్‌ఎండీఏ పరిధిలోని 15 చెరువుల సుందరీకరణ కోసం బుధవారం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల బైక్‌పై 30 కిలోమీటర్లు తిరిగి పరిశీలించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు చెరువులను పరిశీలించారు. హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, కన్సల్టెన్సీ ప్రతినిధులకు చెరువులవారీగా ఎక్కడికక్కడ జగ్గారెడ్డి సూచనలు చేశారు. రూ.2,500 కోట్లతో చెరువుల సుందరీకరణకు త్వరగా డీపీఆర్‌లు సిద్ధం చేస్తే తాను సీఎం రేవంత్‌రెడ్డికి ఇస్తానని పేర్కొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న జగ్గారెడ్డి



నిర్మలతో కలిసి బైకు నడుపుతూ చెరువుల సందర్శనకు బయల్దేరిన జగ్గారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● తెలంగాణ సాయుధ పోరాట అమరులకు జోహార్లు
● నీళ్లు, నిధులు, నియామకాలు, ప్రజల ఆకాంక్షలపై ఏర్పడ్డ రేవంత్ ప్రభుత్వం
● రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
● కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవం, జాతీయ జెండా ఆవిష్కరణ

సిద్దిపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఎగురవేశారు. 1948 ఆగస్టు 27న అసువులు బాసిన వందలాది మంది అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు, తెలంగాణ అమరవీరులకు, బైరాన్‌పల్లి అమరవీరులకు జోహార్లు అంటూ నినదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకుంటున్నామని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో నీళ్లు, నిధులు, నియామకాలు ప్రజల ఆకాంక్షలతో ఏర్పడిన ప్రభుత్వం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో

మిగతా 8వ పేజీలో

బైరాన్‌పల్లిని స్మారక కేంద్రంగా ఏర్పాటు చేస్తాం

● రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 6
● వీరబైరాన్‌పల్లిగా గెజిట్ కోసం ప్రభుత్వం దృష్టికి : ఎంపీ చామల



కార్యక్రమానికి హాజరైన అధికారులు, నాయకులు, ప్రజలు



జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం

దేశ గురువు పేరిట వసూళ్లు

● నిలదీయడంతో తిరిగి చెల్లింపు



నంగునూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాను బాబానని, మీ బాధలు తీరుస్తానంటూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఒకరిని యువకులు నిలదీయడంతో తిరిగి చెల్లించి, పత్తా లేకుండా పారిపోయిన ఉదంతం ఇది. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి సోమవారం రాత్రి గుర్రంపై ఓ వ్యక్తి వచ్చాడు. అతని అనుచరులు సదరు వ్యక్తి దేశ గురువు అని 'మీ బాధలు.. ఇబ్బందులు తొలగిస్తారు' అంటూ ప్రచారం చేశారు. దీంతో కొందరు అతనికి బస ఏర్పాటు చేశారు. ఉదయం దేశగురువు గ్రామంలో గుర్రంపై తిరుగుతారని, గుర్రానికి నీళ్లు పోసి బాధలు చెప్పుకుంటే తాయత్తు ఇచ్చి సమస్యలు తీరుస్తారని దండోరా వేయించారు. మంగళ, బుధవారాల్లో సదరు బాబాగా చెప్పుకున్న వ్యక్తి, అనుచరులు గ్రామంలో ఇంటింటికీ తిరిగారు. ఈ క్రమంలో కొందరు తమ బాధలు చెప్పుకుంటూ, వాటిని తీర్చాలని వేడుకున్నారు. పూజలు చేసి మీ సమస్యలు దూరం చేస్తానని, అంత వరకు తాను ఇచ్చే తాయత్తు కట్టుకోవాలని చెప్పి డబ్బులు వసూలు చేశారు. ఇదంతా గమనించిన గ్రామానికి చెందిన యువకులు బుధవారం సదరు వ్యక్తితో పాటు అతని అనుచరులను నిలదీశారు. వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో, గ్రామస్థుల వద్ద వసూలు చేసిన డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కొందరికి ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించి గుర్రాన్ని వెంట తెచ్చుకున్న సామగ్రిని ఆటోలో ఎక్కించి కారులో అక్కడి నుంచి ఉడాయించారు.

ఫైర్ స్టేషన్‌కు కొత్త భవనం

● రూ. 1.25కోట్లతో నిర్మాణం
● ఏడాదిలోగా సొంత భవనంలోకి మారే అవకాశం
● హుస్నాబాద్ అగ్నిమాపక సిబ్బందికి తీరనున్న కష్టాలు



నిర్మాణంలో ఉన్న అగ్నిమాపక కేంద్ర భవనం

హుస్నాబాద్, సెప్టెంబరు 17 : ఉమ్మడి జిల్లాల సరిహద్దులో ఉన్న హుస్నాబాద్‌లో ఏ విపత్తు వచ్చినా తక్షణం సేవలందించే అగ్నిమాపక కేంద్రం ఇకపై సొంత భవనంలోకి మారనుంది. ఇప్పటివరకు సరైన వసతులు లేని అద్దె భవనంలో కష్టాలు పడుతున్న సిబ్బందికి ఇది ఊరట కలిగించే విషయం. ఫైర్‌స్టేషన్ భవనానికి రెండేళ్ల క్రితమే నిధులు మంజూరైనప్పటికీ, కొన్ని కారణాల వల్ల పనులు ఆలస్యమయ్యాయి. ఈ కేంద్రం హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, మద్దూర్‌తో పాటు కరీంనగర్ జిల్లాలోని చిగురుమామిడి, హన్మకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలాల్లోని కొన్ని గ్రామాలకు సేవలు అందిస్తోంది. ప్రస్తుతం ఒక ఫైర్ ఆఫీసర్, ఇద్దరు లీడింగ్ ఫైర్‌మన్లు, నలుగురు ఫైర్‌మన్లు, ముగ్గురు డ్రైవర్ ఆపరేటర్లు, 13 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. 15ఏళ్లుగా అగ్నిమాపక సిబ్బంది రైతు సేవా కేంద్రంలో కేటాయించిన చిన్న గదిలో ఇరుకుగా ఉంటున్నారు. సరైన కార్యాలయం, విశ్రాంతి గదులు, బాత్‌రూంలు లేక ఇబ్బందులు పడ్డారు. హుస్నాబాద్ మార్కెట్ యార్డులోని 10 గుంటల స్థలంలో అగ్నిమాపక కేంద్రం కోసం స్థలం కేటాయించి, రూ.1.25 కోట్లు మంజూరు చేశారు. 2022లో శంకుస్థాపన చేసినా, మూడునెలల క్రితం వరకూ పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతుండటంతో, సిబ్బంది తమ కష్టాలు తీరనున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛతా హీ సేవాలో అందరం భాగమవుదాం

సిద్దిపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవా 2025లో అందరం భాగమవుదామని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవా-2025లో భాగంగా కోమటి చెరువులో ఉన్న తుంగను మున్సిపల్ సిబ్బంది, కౌన్సిల్ సభ్యులతో కలిసి కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ నెల 17న ప్రారంభమైన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం అక్టోబరు 2 వరకు కొనసాగుతుందని తెలిపారు. బతుకమ్మ ఘాట్ల వద్ద ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కాళ్లకుంట కాలనీలో, ఇందిరమ్మ కాలనీలలో మొరం నాణ్యతను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని డీఆర్‌సీసీ నిర్వహణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

జిల్లాలో చిరుజల్లులు

● సిద్దిపేటలో భిన్న వాతావరణం
● కాసేపు ఎండ, కాసేపు వర్షం
● గరిష్ఠంగా 38.0 మి.మీ వర్షపాతం నమోదు

సిద్దిపేట/చిన్నకోడూరు సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. సిద్దిపేటలో కురిసిన చిరుజల్లులకు పలు కాలనీలు జలమయమయ్యాయి. బుధవారం భిన్న వాతావరణం కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కాసేపు ఎండ, కాసేపు చిరుజల్లులు కురవగా, మధ్య మధ్యలో మేఘాలు కమ్ముకున్నాయి. ఒక్కోచోట ఒక్కోలా వర్షం కురిసింది. జిల్లాలో గరిష్ఠంగా జగదేవ్‌పూర్‌లో 38.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. వర్గల్‌లో 31.8 మి.మీ., ములుగులో 30.0 మి.మీ., రాయపోల్‌లో 15.8 మి.మీ., సిద్దిపేట అర్బన్‌లో 15.3 మి.మీ., గజ్వేల్‌లో 11.5 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. బుధవారం రాత్రి కూడా తొగుటతో పాటు పలుచోట్ల భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

అలుగు పారుతున్న చెరువులు, కుంటలు

ఇటీవల కురుస్తున్న వర్షాలకు చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు అలుగుపారుతున్నాయి. భూగర్భ జలాలు పెరగడం వల్ల బావులు, బోరు బావులలో నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత వానాకాలం పంటలతో పాటు, వచ్చే యాసంగి పంటలకు సైతం సాగు నీటికి ఢోకా ఉండదని ఆయా గ్రామాల అన్నదాతలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అలుగు పారుతున్న చిన్నకోడూరు అమ్మచెరువు



చిన్నారికి సర్టిఫికెట్ అందజేస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నారులను చూస్తే కొత్త ఉత్సాహం

● మాజీ మంత్రి హరీశ్‌రావు
● సంజీవని ఆస్పత్రిలో చిన్నారులకు గిఫ్ట్ ఆఫ్ లైఫ్ సర్టిఫికెట్ల అందజేత

కొండపాక/గజ్వేల్ సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తన రాజకీయ జీవితంలో రెండు విషయాలు తృప్తినిచ్చాయని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. చిన్నారుల గుండెలు బాగుపడి, వారి తల్లిదండ్రుల కళ్లలో మెరుపులు చూసి తనకు ఎంతో ఆనందం కలిగిందని, బీడువారిన భూములకు గోదావరి నీరు అందించి రైతుల కళ్లలో ఆనందాన్ని చూసిన సమయంలో తనకు తృప్తినిచ్చిందని పేర్కొన్నారు. కొండపాక శివారులోని సంజీవని హార్ట్ కేర్ ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ పూర్తయిన చిన్నారులకు గిఫ్ట్ ఆఫ్ లైఫ్ సర్టిఫికెట్ల ప్రదానం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ చిన్నారుల ముఖంలో ఆనందాన్ని చూస్తే కొత్త ఉత్సాహం వచ్చిందన్నారు. సంజీవని ఆసుపత్రి చిన్నారుల గుండెకు నిజంగా సంజీవినిగా నిలిచిందన్నారు. దేశంలో రెండు లక్షల అరవై మంది పిల్లలు పుట్టుకతో గుండె వ్యాధితో బాధపడుతున్నారని, ఆ పిల్లలు, వారి తల్లిదండ్రులు పడే బాధ, క్షోభ అనుభవించే వారికే తెలుస్తుందన్నారు. దేశంలో దాదాపు 60, 70 వేల మందికి ప్రతి సంవత్సరం వైద్యం అందడం లేదని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో సత్యసాయి ట్రస్ట్ వారు ఈ ప్రాంత గర్భిణులకు ఓ ఆస్పత్రి పెట్టాలని కోరారని, చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేసే ఆస్పత్రులను సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల్లో నిర్వహిస్తున్నారని, అలాంటి ఆస్పత్రి ఇక్కడ కూడా పెట్టాలని కోరిన మేరకు వెంటనే ఇంత పెద్ద ఆస్పత్రి ఏర్పాటు చేసి, వందల మంది పిల్లలకు ఉచితంగా ఆపరేషన్లు చేయడం గొప్పవిషయమన్నారు. ఇక్కడ ఇంకో ఆపరేషన్ థియేటర్, ట్రైనింగ్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తామని ట్రస్ట్ చైర్మన్ చెప్పడం పట్ల హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. వీరబ్రహ్మేంద్రస్వామి మార్గం అనుసరణీయమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని జర్నలిస్టుకాలనీలో గుట్టపై ఏర్పాటు చేసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయాభివృద్ధికి సహకరిస్తామని చెప్పారు.

కలగానే మిగిలిన
బీటీరోడ్డు
● చిన్నపాటి వర్షం కురిసినా చిత్తడిమయం
● స్థానికులకు తప్పని ఇక్కట్లు

పదోన్నతులు ప్రోత్సాహాన్ని
కలిగిస్తాయి
● సీపీ అనురాధ
8





గిజిగాడి సందడి..

హుస్నాబాద్‌లోని సంఘమిత్ర కాలేజీ సమీపంలోని ఓ వేపచెట్టు నిండా గిజిగాడి గూళ్లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఇవి చిన్నగా, బొద్దుగా, పసుపు రంగులో చూడముచ్చటగా ఉన్నాయి. గూళ్లు కట్టుకోవడానికి గడ్డిని సేకరించడం, పిల్లలకు ఆహారాన్ని వెతకడం కోసం ఈ పక్షులు పరిసర ప్రాంతాల్లో ఎగురుతూ సందడి చేస్తున్నాయి. ఒకే చెట్టుకు దాదాపు 30 గూళ్లు ఉండడంతో పక్షుల కిలకిలారావాలతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. ప్రకృతి ప్రేమికులకు ఈ దృశ్యం కనువిందులా మారింది.

-సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్



యాజమాన్య
పద్ధతులు పాటించాలి
● నాణ్యమైన విత్తనోత్పత్తి చేసి ఇతర రైతులకు సరఫరా చేయాలి
● తోర్నాల రైతు విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్, శాస్త్రవేత్త పల్లవి

సింగూరుకు తగ్గని
వరద ప్రవాహం
● ఇన్‌ఫ్లో 47,695.. ఔట్‌ఫ్లో 50,751 క్యూసెక్కులు
7

బైరాన్‌పల్లిని స్మారక కేంద్రంగా ఏర్పాటు చేస్తాం

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- వీరబైరాన్‌పల్లిగా గెజిట్ కోసం ప్రభుత్వం దృష్టికి
- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి


అమరవీరుల కుటుంబాలను సన్మానిస్తున్న ఎంపీ చామల

మద్దూరు/సిద్దిపేట సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బైరాన్‌పల్లి వీరుల త్యాగం ఎనలేనిదని, ఇక్కడ స్మారక కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బైరాన్‌పల్లి ప్రత్యేక పాలన వ్యవస్థ ఏర్పాటు చేయడంతోపాటు ఒకరోజు ప్రత్యేకంగా సీఎంను తీసుకొచ్చి అమరవీరులకు నిజమైన శ్రద్ధాంజలి ఘటించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. దూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి బురుజు, అమర వీరుల స్థూపం వద్ద మంత్రి పొన్నం, ఎంపీ చామల జాతీయ జెండాను ఎగురవేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అమరవీరుల విమోచన దినోత్సవ సభలో మాట్లాడారు. తెలంగాణ అస్థిత్వాన్ని, కళాకారుల్ని, సంస్కృతిని, అమరవీరులను, తెలంగాణ నీళ్ల, నిధులు, నియామకాలపై ప్రత్యేకమైన శ్రద్ధతో ప్రజాపాలన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పాటు, కేసీఆర్ సీఎం అయ్యాక నీళ్ల, నిధులు నియామకాలు కేవలం ఆయన కుటుంబానికి మాత్రమే వచ్చాయని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. నిజాంకు కేసీఆర్‌కు ఏ మాత్రం తేడా లేదని తెలిపారు. వీరబైరాన్‌పల్లిగా నామకరణం చేసి గజిట్ కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అమరుల స్థూపం, బురుజు అభివృద్ధికి తన నిధుల ద్వారా రూ.10 లక్షలు తక్షణమే అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబాలను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి గిరి కొండల్‌రెడ్డి, నాయకులు, పలువురు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులు వెనక్కి తగ్గాలి

ఆరోగ్య శ్రీ సేవల నిలిపివేతపై ప్రైవేట్ ఆస్పత్రులు వెనక్కి తగ్గాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. బుధవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ నిలిపివేయడం వల్ల పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మానవీయ కోణంలో ఆలోచించి, ఆరోగ్య శ్రీ సేవలు పునరుద్ధరించాలని సిద్దిపేట జిల్లాకు సంబంధించి ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు.

ఆవంచ, రెడ్డిపల్లిలో ఉత్తరప్రదేశ్ సర్పంచుల బృందం పర్యటన


ఉత్తరప్రదేశ్ బృందాన్ని సన్మానిస్తున్న నాయకులు

నర్సాపూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆవంచ, రెడ్డిపల్లి గ్రామాల్లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సర్పంచులు, అధికారుల బృందం బుధవారం పర్యటించింది. స్థానిక నాయకులు బృందానికి ఘనంగా స్వాగతం పలికడమే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. రాష్ట్రంలోని పంచాయతీ వ్యవస్థతో పాటు గ్రామాల అభివృద్ధి, సంక్షేమాల అమలు తీరును క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. స్థానిక ఎంపీడీవో మధులత ఆధ్వర్యంలో ఇక్కడి స్థానిక అధికారులు గ్రామంలో అమలవుతున్న పనులు, సంక్షేమ పథకాలను వారికి వివరించారు. రెడ్డిపల్లిలో బృందాన్ని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఉపసర్పంచ్ అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

పండుగకు ఊరెడుతున్నారా.. జాగ్రత్త

కాలనీలవాసులకు పోలీసుల సూచనలు


ప్రచార ఆటోను ప్రారంభిస్తున్న అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్

అమీన్‌పూర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : దసరా వచ్చిందంటే పట్టణాల నుంచి గ్రామాలకు పెద్ద వలసలు సర్వసాధారణం. కాలనీల్లోని ఇళ్లకు తాళాలు వేసి పిల్లాపాపలతో కుటుంబం సహా గ్రామాలకు వెళ్లిపోతారు. తాళం వేసిన ఇళ్లను చూస్తే దొంగలకు మాత్రం దసరా పండగ ముందే వచ్చినందత సంబరం. ప్రజల్ని అప్రమత్తం చేయడంలో భాగంగా పలు కీలక సూచనలు చేస్తున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాలనీల్లో ఆటోను ప్రచారం కోసం రగంలోకి దింపారు. కాలనీలలో తిరుగుతూ ప్రజల్ని అప్రమత్తం చేయడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని ఇన్‌స్పెక్టర్ నరేష్ పేర్కొన్నారు.

ఇంద్రేశంలో పట్టపగలే చోరీ

- 20 తులాల బంగారు నగలు, 4 కేజీల వెండి అపహరణ

పటాన్‌చెరు సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భార్యాభర్తలు డ్యూటీకి వెళ్లిన తర్వాత ఇల్లుగుల్ల చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ వినాయకరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామం పీఎన్‌ఆర్ కాలనీ తుల్జాభవాని ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న పవన్‌కుమార్ హైటెక్‌సిటీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. భార్య గౌరీ ప్లేస్కూల్‌లో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా మంగళవారం భార్యాభర్తలు డ్యూటీలకు వెళ్లారు. సాయంత్రం 4 గంటలకు భార్య గౌరీ ఇంటికి వచ్చి ఇంటి ప్రధాన ద్వారం తాళాలు పగలకొట్టి కనిపించాయి. పడక గదిలోని బీరువా తెరిచి ఉన్నది. అందులోని బంగారు చైన్‌లు, ఉంగరాలు, నెక్లెస్, చెవిరింగులు, బ్రాస్‌లెట్, నల్లపూసల చైన్‌లు దాదాపు 20 తులాల బంగారం చోరీకి గురైంది. అలానే 4కేజీల వెండి, రూ.8వేలు నగదు దొంగలు తీసుకువెళ్లారు. ఈ మేరకు బుధవారం పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నాలుగేళ్ల క్రితం తండ్రి.. ఇప్పుడు తల్లి మృతి

- అనాథలైన ఇద్దరు పిల్లలు


మృతదేహం వద్ద రోదిస్తున్న రేణుక, విష్ణు

గజ్వేల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తండ్రి నాలుగేళ్ల క్రితం మృతిచెందగా, తాజా తల్లి మృతిచెందడంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారిన సంఘటన గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మిందే గౌరయ్య, మిందె మనీలా(38)కు రేణుక(15), విష్ణు(12) ఇద్దరు సంతానం. నాలుగేళ్ల క్రితం గౌరయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. ప్రైవేటు హోటళ్లో కూలీ పని చేసుకుంటూ మనీలా ఇద్దరు పిల్లలను పోషిస్తున్నది. పని ప్రదేశంలో నెల రోజుల క్రితం కరెంట్ షాక్ తగిలిన మనీలా మృత్యువుతో నెల పాటు పోరాడింది. తీవ్ర గాయాలతో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూసింది. బుధవారం ఉదయం మనీలా మృతదేహాన్ని కొడకండ్లకు తీసుకురావడంతో గ్రామంలో రోదనలు మిన్నంటాయి. మనీలాకు గత ప్రభుత్వం ఇచ్చిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మినహా ఎలాంటి ఆస్తులు లేకపోవడం, అటు గౌరయ్య, ఇటు మనీలాలకు తల్లిదండ్రులు లేకపోవడంతో వారి ఆలనపాలనా చూసుకునే వారు లేకుండా పోయారు. గ్రామస్థులు తలా కొంత చొప్పున డబ్బులు వెచ్చించి మనీలా అంత్యక్రియలు పూర్తి చేశారు.

అప్పులు తీర్చలేక రైతు ఆత్మహత్య


రవి (ఫైల్)

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కలిసి రాకపోవడం, ఆర్థిక ఇబ్బందులు, పెరిగిపోయిన అప్పుల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకుని బలన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని కామారం తండాలో బుధవారం జరిగింది. తండాకు చెందిన దేవసోత్ రవి(44) వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. తన ఇంటి నిర్మాణం కోసం, వ్యవసాయ పెట్టుబడి అవసరాల నిమిత్తం ఓ బ్యాంకులో పొలాన్ని తాకట్టు పెట్టి రూ.5 లక్షల రుణాన్ని తీసుకున్నాడు. ఈ అప్పులు తిరిగి చెల్లించే మార్గం కనిపించకపోవడంతో మనోవేదనకు గురై బుధవారం తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

కూలీగా వచ్చి గంజాయి అమ్మకం

- 1.350 కిలోల సరుకు స్వాధీనం

తూప్రాన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూలీ పనులు చేస్తూ గంజాయి విక్రయిస్తున్న ఒకరిని మనోహరాబాద్ ఎక్సైజ్ ట్రాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం వలపన్ని పట్టుకున్నారు. తూప్రాన్‌లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ముఖేశ్ కుమార్ మండల్(29) మనోహరాబాద్ మండల కేంద్రంలో ఎస్ఎస్ఏఎఫ్ కోల్డ్ స్టోరేజీ కంపెనీలో కూలీగా పనులు చేస్తున్నాడు. బీహార్ నుంచి ఎండు గంజాయి తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడి చేసి నిందితుడిని పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి, నిందితుడి నుంచి 1.350 కిలోల ఎండు గంజాయిని, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని నర్సాపూర్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో అప్పగిస్తున్నట్లు వివరించారు.

కొమురవెల్లి శివారులో గంజాయితో పట్టుబడ్డ వ్యక్తి..

కొమురవెల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి శివారులోని దాచారం గుట్ట సమీపంలో హైదారాబాద్ చింతల్‌కు చెందిన కుంబ భూమరాజు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు బుధవారం పట్టుకున్నారు. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కొమురవెల్లి ఎస్ఐ రాజుగౌడ్ నిందితుడిని అదుపులోకి తీసుకుని 195 గ్రాముల గంజాయిని, సెల్‌ఫోన్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్ వైర్ అపహరణ

చేర్యాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ముస్త్యాల గ్రామ శివారులోని సలాక్ పూర్ క్రాస్‌రోడ్డు సమీపంలో అంజయ్య వ్యవసాయబావి వద్ద 25కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులో నుంచి కాపర్‌వైర్‌ను అపహరించుకుపోయారు. బుధవారం ఉదయం గమనించిన స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించగా, విద్యుత్ పునరుద్ధరణకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు.

ఇద్దరి అదృశ్యం

పటాన్‌చెరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన కేసులు నమోదయ్యాయి. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్న మమతకుమారి మంగళవారం ఉదయం కిరాణా దుకాణానికి వెళ్లి సరుకులు తెస్తానని బయటకు వెళ్లారు. సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. భర్త సంతోష్‌పాశ్వాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామ విజేత కాలనీలో నివాసం ఉంటున్న రామ్‌లాల్ నాయక్ మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. భార్య మీరాభాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



పోలీస్ కార్యాలయాల్లో ప్రజాపాలన దినోత్సవం

సెప్టెంబరు 17ను పురస్కరించుకుని బుధవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల పోలీస్ కార్యాలయాల్లో ఎస్పీలు పరితోష్ పంకజ్, డీవీ శ్రీనివాసరావులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్ జెండా ఎగురవేశారు. ఆయా చోట్ల వారితో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

-మెదక్ అర్బన్/సంగారెడ్డి క్రైం/సిద్దిపేట క్రైం





తర'గతి' ఇంతేనా?

సర్కారు చదువులు అధ్వాన స్థితిలో కొనసాగుతున్నాయి. ఓ ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరుకుని తరగతి గదులు సరిపోకపోవడంతో చెట్ల కింద, వరండాల్లో చదువులు సాగుతుంటే.. మరో బడిలో విద్యార్థులు ఉదయం వచ్చేసరికి ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.. ఇక ఓ గురుకుల విద్యాలయంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు ఇరుకు గదుల్లో, సరైన వసతి లేక అగచాట్లు పడుతున్నారు.

అధ్వాన స్థితిలో సర్కారు చదువులు

శిథిలావస్థలో గడిపెద్దాపూర్ బడి

జిన్నారం ఎస్టీ గురుకులంలో ఒకే చోట పాఠశాల, కళాశాల

పుల్లూరు బడిలో మద్యం సీసాలు

అల్లాదుర్గం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ ఉన్నత పాఠశాల 65 ఏళ్ల క్రితం నిర్మింపచేసిన పాత భవనంలోనే ఇంకా కొనసాగుతున్నది. విద్యార్థుల సంఖ్య పెరిగినా, అదనపు గదులను మాత్రం నిర్మించకపోవడంతో తరగతులు నిర్వహించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్న వాటిలోనే,


గడిపెద్దాపూర్‌లో పాతబడిన ఉన్నత పాఠశాల

ఉన్నతాధికారులకు నివేదించాం



శిథిలావస్థలో ఉన్న ఈ పాఠశాల భవనంతో పొంచిఉన్న ప్రమాదంపై తాము ఉన్నతస్థాయి అధికారులకు విన్నవించాం. పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలు, తరగతి గదుల కొరతపై వివరించాం. ఈ నెల 14న పాఠశాల తరగతి గది పైకప్పు పెచ్చులు ఊడికింద పడటంతో విద్యార్థులు సైతం భయాందోళన చెందుతున్నారు.

- నర్సింహులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు

65 ఏళ్ల పాతభవనంలో..

ఇరుకు గదుల్లోనే ఉపాధ్యాయులు బోధిస్తుండగా, శిథిలావస్థలో ఉన్న భవనంలో విద్యార్థులు భయం, భయంగా పాఠాలు వింటున్నారు.

చెట్ల కింద, వరండాల్లో...

గడిపెద్దాపూర్ పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియం కొనసాగుతున్నది. బడిలో ఉపాధ్యాయుల కొరత లేకపోయినప్పటికీ, వసతుల లేమితో నానా పాట్లు పడాల్సి వస్తున్నది. పాఠశాలలో 225 మంది విద్యార్థులుండగా కేవలం మూడు తరగతి గదులు మాత్రమే ఉండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వరండాలో, చెట్ల కిందనే తరగతులు కొనసాగుతున్నాయి. 65 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం పైకప్పు రేకులతో శిథిలావస్థలో ఉన్నది. పదేళ్ల క్రితం ప్రభుత్వం అదనంగా మూడు తరగతి గదులను నిర్మింపచేయగా ఈ భవనంలోని ఓ తరగతి గదిలో గత ఆదివారం పైకప్పు పెచ్చులూడి కింద పడింది. రేకులషెడ్డులో కొనగసాతున్న ఇతర తరగతి గదులు గోడలు ఎప్పుడు కూలిపోతాయోననే స్థితిలో ఉన్నాయి. గతంలో ఓ తరగతి గది పూర్తిస్థాయిలో కూలిపోయింది. అధికారులు స్పందించి నూతన భవనం నిర్మింపజేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


చెట్లకింద 8, 9, 10వ తరగతి విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులు


జిన్నారంలో గల ఎస్టీ గురుకుల పాఠశాల

విశాల ప్రాంగణం ఉన్నా..

జిన్నారం, సెప్టెంబరు 17, (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన జిన్నారంలోని ఎస్టీ గురుకుల విద్యాలయానికి 30 ఎకరాల విశాల ప్రాంగణం ఉన్నది. కానీ, పాఠశాల కోసం నిర్మించిన భవనంలోనే జూనియర్ కళాశాల కూడా కొనసాగుతుండడంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పటం లేదు. ఎస్టీ గురుకుల పాఠశాలకు 2017లో జూనియర్ కళాశాల మంజూరు కాగా, నాటి నుంచి ఒకే చోట తరగతులు నిర్వహిస్తూ వసతి గృహ సౌకర్యం కల్పించారు.

అదనపు భవనాలు నిర్మిస్తే కళాశాల, పాఠశాల నిర్వహణకు సౌకర్యంగా ఉంటుంది. జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 160 సీట్లకు 67 మంది విద్యార్థులు, ఇక పాఠశాలలో 480 మందికి 463 విద్యార్థులు ఉన్నారు. 8 ఏళ్లుగా పాఠశాల భవనాల తరగతి గదులనే జూనియర్ కళాశాల కోసం వినియోగిస్తుండగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇక్కట్లు తప్పటం లేదు. కళాశాలకు ప్రత్యేకంగా ల్యాబ్ సౌకర్యం లేదు. ప్రస్తుతం ఉన్న వసతి గృహాలు పాఠశాల విద్యార్థులకే సరిపోతుండగా, కళాశాల విద్యార్థులు అక్కడే ఉండటంతో ఇరుకుఇరుకుగా కాలం వెళ్లదీస్తున్నారు. పాఠశాలలో 27 మంది, కళాశాలలో ఏడుగురు అధ్యాపక సిబ్బందితో కలిపి మొత్తం 40 మంది వరకు ఉండగా వీరు ఉండటానికి వసతి గృహాలు పూర్తిస్థాయిలో లేవు. కేవలం పది మంది వరకు ఉండే వీలుగా క్యాటర్స్ ఉండగా, ఇతర సిబ్బంది ఇక్కట్ల మధ్యే రాకపోకలు సాగిస్తున్నారు. స్థానికంగా ఉన్న పరిశ్రమల సీఎస్ఆర్ నిధుల వినియోగంతో అదనపు భవనాలు నిర్మించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

ఒకే చోట సర్దుబాటు

గురకుల పాఠశాల, కళాశాలలకు తరగతి గదులను సర్దుబాటు చేసి ఒకే చోట నిర్వహిస్తున్నాం. అదనపు గదుల నిర్మాణానికి ఇప్పటికీ ప్రతిపాదనలు పంపించాం. సీఎస్ఆర్ నిధుల మంజూరుకు ఎమ్మెల్యే, గురుకుల విద్యాధికారుల దృష్టికి తీసుకెళతాం.

- వెంకటయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

పుల్లూరు పాఠశాలలో మద్యం సీసాలు

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండలంలో మందుబాబుల ఆగడాలకు హద్దులేకుండా పోతున్నది. ఏకంగా పాఠశాలలోనే మద్యం సేవిస్తున్నారు. పుల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగి, ఖాళీ సీసాలను విచ్చలవిడిగా పడేసి వెళ్లారు. ఉదయం విద్యార్థులు పాఠశాలకు వచ్చేసరికి ఖాళీ సీసాలు దర్శనమిస్తున్నాయి. పాఠశాలను దేవాలయంలా చూసుకోవాల్సింది పోయి.. అదే పాఠశాలలలో మద్యం సీసాలు, వాటర్ బాటిళ్లు, సిగరేట్ పీకలు పడవేయడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మద్యం సేవించిన వారి పై చర్యలు తీసుకోవాలని, రాత్రి సమయంలో పోలీసు పెట్రోలింగ్ పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు.


పుల్లూరు ప్రభుత్వ పాఠశాలలో ఖాళీ మద్యం సీసాలు

సాయుధ పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తోంది

● సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ వక్రీకరిస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట మహాసభను బుధవారం సంగారెడ్డిలో నిర్వహించారు. సీపీఎం నాయకులు పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహం నుంచి పాతబస్టాండ్ మీదుగా పోతిరెడ్డిపల్లి చౌరస్తా వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మహాసభలో రాఘవులు మాట్లాడుతూ తెలంగాణ తెలంగాణ సాయుధ పోరాటాన్ని విమోచన దినంగా నిర్వహించడం సిగ్గుచేటన్నారు. నైజాం, బీజేపీ విధానాలు ఒక్కటేనని, తాము నైజాం వారసులమని బీజేపీ నాయకులు ప్రకటించుకుంటే సరిపోతుందని ఎద్దేవా చేశారు. ఆనాడు బ్రిటీష్ వారికి తొత్తులుగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు పనిచేసినట్టు చరిత్రనే చెబుతున్నదన్నారు. ప్రజల్లో మత విద్వేశాలను రెచ్చగొట్టి, తమ ఎజెండాను అమలు చేసుకునేందుకు అనేక రకాలుగా ప్రయత్నిస్తున్నదని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు మాట్లాడుతూ నాటి గెరిల్లా యుద్ధ చరిత్రను నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్రీకరిస్తూ హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా నమ్మించేందుకు కుట్రలు చేస్తుందన్నారు. చరిత్రను రాజకీయ లబ్ధి కోసం మార్చే కుట్రలను ప్రజలు గుర్తించి తిరగబడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు మల్లికార్జున్, సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యాదగిరి, ప్రవీణ్‌కుమార్, విద్యాసాగర్, నాగేశ్వర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

● రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ సంచాలకుడు గాజర్ల రమేష్

కొండపాక, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రాథమికస్థాయి నుంచే విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన సాగితే ఆలోచన శక్తి పెరుగుతుందని, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేలా ఉపాధ్యాయుల కృషి ఉండాలని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ సంచాలకుడు, సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి గాజర్ల రమేష్ పేర్కొన్నారు. కొండపాక మండలం సిరసనగండ్ల ప్రాథమిక పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు చేస్తున్న బోధనను విద్యార్థుల స్థాయిని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. పాఠశాలలోని మూడు, నాలుగు, ఐదో తరగతి విద్యార్థులను పలు ప్రశ్నలు అడగగా, సమాధానాలు చక్కగా చెప్పడంతో వారికి ఆయన చిరు కానుకలను అందజేశారు. పాఠశాలలో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్‌కు సంబంధించిన విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలను తన సొంత ఖర్చులతో అభివృద్ధి పరచిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయప్రకాష్‌రెడ్డి అభినందించాడు. ఉపాధ్యాయుల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశాడు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికలు


రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

మెదక్ అర్బన్/పాపన్నపేట, సెప్టెంబరు 17 : మెదక్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాపన్నపేటలో నిర్వహించిన అండర్-16 కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపిన పలువురు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం మహేశ్వర్ పోటీలను ప్రారంభించగా జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన బాలబాలికలను 12 మంది చొప్పున 24 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. వీరు ఈ నెల 25 నుంచి నిజామాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ ఎంపిక కార్యక్రమంలో కబడ్డీ అసోషియేషన్ కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు కుమార్, జాయింట్ సెక్రెటరీ శ్రీకాంత్, రాజాగౌడ్, శశికుమార్, కోశాధికారి పి.రవి మధు, అంజనేయులు, శ్రీను, రేణుక, లాజర్, గీత, మీనా తదితరులు పాల్గొన్నారు. మంబోజిపల్లి గీతా స్కూల్‌కు విద్యార్థులు శివకుమార్, అభిలాష్, ప్రకాష్, వికేకవర్ధన్, సహస్ర, ప్రీతి ఎంపికైన వారిలో ఉన్నారు. వారిని పాఠశాల సెక్రటరీ రామాంజనేయులు, ప్రిన్సిపల్ మాధవి అభినందించారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపికలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. 300 మంది క్రీడాకారులు తమ ప్రతిభను కనబర్చారు. అండర్-14 బాలికల విభాగంలో 50 మంది, బాలుర విభాగంలో 100 మంది, అండర్-17 బాలికల విభాగంలో 50 మంది, బాలుర విభాగంలో వంద మంది ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ చంద్రశేఖర్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ విజయ్, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు క్రీడాకారులను అభినందించారు. నారాయణఖేడ్ మైనార్టీ బాలుర గురుకుల విద్యాలయం నుంచి రాష్ట్ర స్థాయికి షహనాజ్, షారుఖ్, ఇర్ఫాన్, ఫయాజ్ ఎంపికయ్యారు. వారిని ప్రిన్సిపల్ రాములతో పాటు క్రీడా ఉపాధ్యాయులు అజయ్‌సంతోష్, ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జితేందర్, విజయ్, రమేష్ అభినందించారు.

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు వేదశ్రీ


జిల్లా స్థాయి సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు సంగారెడ్డి శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ విద్యార్థిని వేదశ్రీ ఎంపికయ్యారు. క్వాంటం యుగం ప్రారంభం- అవకాశం సవాళ్ల అనే అంశంపై సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో వేదశ్రీ మొదటి స్థానంలో నిలిచింది. ఈ నెల 18 న ఎస్‌సీఈఆర్‌టీలో జరిగే రాష్ట్రస్థాయి సెమినార్‌లో ఆమె పాల్గొననున్నారు. వేదశ్రీని డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలి

● నాణ్యమైన విత్తనోత్పత్తి చేసి ఇతర రైతులకు సరఫరా చేయాలి

● తోర్నాల రైతు విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్, శాస్త్రవేత్త డా.పల్లవి

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పరిశోధన కేంద్రాల్లో అభివృద్ధి చేసిన నాణ్యమైన విత్తనాలను యాజమాన్య పద్ధతుల్లో సాగు చేసి అధిక దిగుబడులను సాధించాలని తోర్నాల రైతు విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ పల్లవి రైతులకు సూచించారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక, రాఘవాపూర్, పుల్లూరు, పెద్దలింగారెడ్డిపల్లి గ్రామాల్లోని రైతుల భూముల్లో వరి, పెసర పంటలను ఆమె క్షేత్రతస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లవి మాట్లాడుతూ పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేసిన విత్తనాలను గ్రామంలో ముగ్గురు రైతులకు అందించామని తెలిపారు. రైతులు పండించిన పంటలు నేరుగా తోటి రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసే స్థాయికి ఎదగాలని చెప్పారు. తడులు, కలుపు నివారణ, ఎరువు, సస్యరక్షణ చర్యలను ఆమె రైతులకు వివరించారు.


పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరేష్, ఏఈవోలు భువన, ప్రదీప్త, సుమిత్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ భవనాలను ఆన్‌లైన్ చేయండి

● పదేళ్లవుతున్నా.. అసెస్‌మెంట్ ఎందుకు చేయలేదు

● సంగారెడ్డి డివిజనల్ పంచాయతీ అధికారి అనిత

పుల్‌కల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల భవనాలను కొలతలు చేపట్టి.. ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంగారెడ్డి డీఎల్పీవో అనిత పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని కోర్పోలు, సుల్తాన్‌పూర్, సరాఫ్‌పల్లి గ్రామాల శివారు భూముల్లో గత పదేళ్ల క్రితం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలను నిర్మించారు. పెద్ద పెద్ద భవనాలు నిర్మించినప్పటికీ నయా పైసా ఆస్తిపన్ను చెల్లించడం లేదంటూ కోర్పోలు గ్రామానికి చెందిన పలువురు యువకులు ప్రజావాణిలో కలెక్టర్ ప్రావీణ్యకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్పందించిన కలెక్టర్ విచారణ జరుపాల్సిందిగా జిల్లా పంచాయతీ అధికారులను ఆదేశించగా, సంగారెడ్డి డీఎల్పీవో అనిత బుధవారం కోర్పోలు, సుల్తాన్‌పూర్ గ్రామ పంచాయతీలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పర్యటించి, భవన నిర్మాణాలను పరిశీలించారు. కేవలం సుల్తాన్‌పూర్ పంచాయతీకి ఏడాదికి రూ.6.90 లక్షలు చెల్లిస్తుండగా, కోర్పోలు, సరాఫ్‌పల్లి పంచాయతీలకు నయా పైసా ఆస్తిపన్ను చెల్లింపు చేయడం లేదు. అయితే, ఏ గ్రామ శివారులో ఎంత భూమిని తీసుకున్నారో గుర్తించి, ఎన్ని భవనాలు నిర్మించారో కొలతలు చేపట్టాలని సూచించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కలసికట్టుగా జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల భవనాలను పరిశీలించి కొలతలు చేపట్టాలన్నారు.

కోర్టు కోసం 25న భవనం అప్పగింత

● తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తూప్రాన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో కోర్టు ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఈనెల 25న కోర్టు కోసం మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనం అప్పగిస్తున్నట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. 11న 'ఆంధ్రజ్యోతి'లో 'తూప్రాన్‌లో కోర్టు ఎప్పుడు?' కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. బుధవారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఒక ప్రకటన విడుదల చేస్తూ తూప్రాన్‌కు గతంలోనే కోర్టు మంజూరైందని, వసతి లభించకపోవడంతో కోర్టు ప్రారంభం కాలేదన్నారు. జిల్లా న్యాయాధికారి పలు భవనాలు పరిశీలించగా, ఎంపీడీవో కార్యాలయం ఉపయోగించేందుకు ఖరారు చేసినట్లు వివరించారు. నిర్మాణంలో ఉన్న డివిజన్ కార్యాలయాల (ఐడీవోసీ) భవనం పూర్తి కాలేదని, పూర్తయితే కార్యాలయాలు అందులోకి మారుతాయని కోర్టు అధికారులకు వివరించినట్లు తెలిపారు. కోర్టుకు ఎంపీడీవో భవనం కావాలని కోరడంతో మంత్రి దామోదర్ ఆదేశాలతో ఐడీవోసీ భవనంలో గదులను తాత్కాళికంగా పూర్తి చేసి, అందులోకి ఎంపీడీవో కార్యాలయం షిఫ్టు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కోర్టు అత్యవసరంగా ఏర్పాటు చేయాల్సి ఉన్నందున 22లోపు ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాలు షిఫ్టు చేస్తున్నట్లు వివరించారు. 25న ఎంపీడీవో కార్యాలయ భవనం కోర్టు అధికారులకు అప్పగిస్తామని తెలిపారు.

సింగూరుకు తగ్గని వరద ప్రవాహం

● ఇన్‌ఫ్లో 47,695.. ఔట్‌ఫ్లో 50,751 క్యూసెక్కులు

● ఆరు క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల


పుల్‌కల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి) : సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం తగ్గడం లేదు. ఎగువన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి ప్రాజెక్టులో చేరుతూనే ఉన్నది. బుధవారం ఆరు క్రస్ట్ గేట్ల ద్వారా వరద నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 47,695, ఔట్ ఫ్లో 50,751 క్యూసెక్కులుగా నమోదయింది. ఆరు క్రస్ట్ గేట్ల ద్వారా 48,242 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ గుండా 1,849 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 120 క్యూసెక్కులు, హెచ్ఎండబ్ల్యూఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, 390 క్యూసెక్కులు ఆవిరి అవుతుండగా మొత్తం ఔట్‌ఫ్లో 50,751 క్యూసెక్కులుగా నమోదయింది. బుధవారం రాత్రి అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులో 520.595 మీటర్లకు 16.870 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. మంజీర రిజర్వాయర్ వద్ద నాలుగు క్రస్ట్‌గేట్లు, ఒక స్కవర్ గేట్‌ను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లుగానే ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు.

ఎమ్మెల్సీ కవితకు విద్యాధరి క్షేత్ర నవరాత్రుల ఆహ్వానం

వర్గల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వర్గల్ విద్యాధరి క్షేత్రంలో జరగనున్న అమ్మవారి శరన్నవరాత్రోవాలకు హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యుడు ఎమ్మెల్సీ కవితకు బుధవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. విద్యాధరి క్షేత్రంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 1 వరకు సరస్వతీ అమ్మవారి శరన్నవరాత్రోత్సవాలు జరగనున్నారు. కార్యక్రమంలో నాచగిరి లక్ష్మీనృసింహస్వామి ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి, ఆలయ కమిటీ సభ్యులు టేకులపల్లి బాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాలుయాదవ్ తదితరులు ఉన్నారు. దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు.


ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ప్రతినిధులు

ఇక వర్షాలు చాలు స్వామి..



మెదక్ జిల్లాలో భారీ వర్షాలు పడుతు రైతులతో పాటు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నందున ఇక వర్షాలు చాలంటూ నర్సాపూర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి, కాంగ్రెస్ నాయకుడు పైడిశ్రీధర్‌గుప్తా స్థానిక మల్లికార్జునస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

-నర్సాపూర్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి)



కోహెడ పోలీస్ స్టేషన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్సై అభిలాష్



బెజ్జంకిలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



బెజ్జంకి ఏఎంసీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న చైర్మన్ పులి కృష్ణ

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



జాతీయ జెండాను అవిష్కరిస్తున్న సిద్దిపేట రూరల్ ఎంపీడీవో మురళీధర్ శర్మ



కొమురవెల్లి మల్లన్న ఆలయంలో జాతీయజెండా ఆవిష్కరిస్తున్న ఈవో

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, పాఠశాలల్లో అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. న్యూస్‌నెట్‌వర్క్ సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి)



దుబ్బాకలోని మున్సిపల్ కార్యాలయం ముందు జాతీయజెండావిష్కరణ చేస్తున్న కమిషనర్ కళ్యాణ రమేష్



గజ్వేల్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న నవాజ్‌మీరా

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు హుస్నాబాద్ విద్యార్థులు



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

హుస్నాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ ఎంపిక పోటీల్లో హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల పీడీ శ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన వారిలో గౌరవేని రిశ్వంత్, ఎండీ సానియా, గౌరవేని అశ్వంత్, జంగ అఖిల్, పున్న పవిత్ర ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం వాసుదేవరెడ్డి అభినందించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

(5వ పేజీ తరువాయి)

వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు వివరించారు. సాధించుకున్న తెలంగాణలో అందరూ సుఖ సంతోషాలతో ఉండేలా ప్రజాపాలన అందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, తనతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణరావు, టీజీపీఎస్సీ చైర్మన్ వెంకటేశం లాంటి వారు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి వచ్చారని తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, సీపీ అనురాధ, జిల్లా అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్, నాయకులు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, అత్తుఇమామ్ ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

19న నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

గజ్వేల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న అండర్-19 జిల్లా స్థాయి జూనియర్ బాల, బాలికల, సీనియర్ పురుషులు, మహిళల నెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు నల్లా విజయరేఖ, ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, 2007 మార్చి 31తర్వాత జన్మించిన క్రీడాకారులు వయసు ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డుతో ఉదయం 10గంటలకు హాజరుకావాలని సూచించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

గజ్వేల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజూం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ తెలుగు సబ్జెక్ట్ పోస్టు ఖాళీగా ఉందని, అర్హులైన నిరుద్యోగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు.

ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18, గురువారం రోజున ఉదయం 10గంటలకు తమ సర్టిఫికెట్ల జిరాక్సులతో కళాశాలలో హాజరుకావాలని, ఇంటర్వ్యూ, డెమో క్లాసుల ద్వారా ఎంపిక ఉంటుందని తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గాయాలు.. కార్మికుడి మృతి

● సంతాపం తెలిపిన అధికారులు, కార్మికులు

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గ్రామ పంచాయతీ కార్మికుడు మృతి చెందిన సంఘటన నారాయణరావుపేట మండలం కోదండరావుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గ్యాదపాక రమేష్ గ్రామ పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. రెండు నెలల క్రితం బైక్ యాక్సిడెంట్ కావడంతో సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. యాక్సిడెంట్ వల్ల వెన్నెపూస దెబ్బతినడంతో పాటు రెండు కాళ్లు చచ్చుబడి పోయాయి. దీంతో రమేష్‌ని మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎంపీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ జింక జయంత్ రమేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దహన సంస్కారాల నిమిత్తం గ్రామ పంచాయతీ నుంచి రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి చంద్రలేఖ, తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి తూనికి మహేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సెమినార్‌కు ఆకునూరు జడ్పీఎస్ఎస్ ఉపాధ్యాయుడు

చేర్యాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ఆకునూరు జడ్పీఎస్ఎస్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు రాస రవీందర్ జాతీయస్థాయి సెమినార్‌కుఎంపికయ్యారు. ఇంటర్నేషనల్ ఎలక్ట్రో టెక్నికల్ కమిషన్ 89వ సాధారణ సమావేశం న్యూ ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్నాయి. ఈక్రమంలో అంతర్జాతీయ ఎలక్ట్రో టెక్నికల్ ప్రమాణాల నిర్ణయంపై చర్చించేందుకు విదేశాల నుంచి సుమారు 2వేలమంది నిపుణులు హాజరవతుండగా, సిద్దిపేట జిల్లానుంచి ఆకునూరు జడ్పీఎస్ఎస్‌కు చెందిన రవీందర్‌ను ఆహ్వానించారు. నేడు ఆయన ఢిల్లీలో తన ప్రసంగం చేయ నుండగా, స్థానికులు ఆయనను అభినందించారు.

కలగానే మిగిలిన బీటీరోడ్డు

● చిన్నపాటి వర్షం కురిసినా చిత్తడిమయం

● స్థానికులు, ప్రయాణికుల ఇక్కట్లు

చేర్యాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం వీరన్నపేట గ్రామం నుంచి చుంచన కోట వరకు బీటీ రోడ్డు నిర్మాణం కలగానే మారింది. జనగామ - సిద్దిపేట జాతీయ రహదారిని ఆనుకుని రెండు జిల్లాల సరిహద్దులోని వీరన్నపేట గ్రామం మీదుగా చుంచనకోట వరకు ఎన్నో యేళ్లక్రితం మట్టిదారి నిర్మించారు. కానీ బీటీ రోడ్డు నిర్మాణానికి నోచుకోక దారి పొడవునా పలు ప్రదేశాలలో కంకరతేలింది. పలు ప్రదేశాలలో గుంతలమయమవడంతో ప్రయాణం సంకటంగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా చిత్తడిమయమై వాహనాలు అదుపు తప్పుతుండటంతో ప్రయాణీకులు గాయాలపాలవుతున్నారు. బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించడంతోపాటు ఆందోళనలు కొనసాగిస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. వీరన్నపేట నుంచి చుంచనకోట వరకు ఆయా గ్రామాల రైతుల వ్యవసాయభూములు ఉండడంతో పాటు తక్కువ దూరంలో చుంచనకోట మీదుగా బచ్చన్నపేట, చేర్యాల మండలాలకు పయనిస్తున్నారు. కానీ దారి పాడై ప్రమాదకరంగా మారడంతో నానాతంటాలుప డుతున్నారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు దారి మరింత అధ్వాన్నంగా మారింది.

ప్రతిపాదనలు పంపించినా..

వీరన్నపేట- చుంచనకోట వరకు బీటీరోడ్డు దశలవారీ ఏర్పాటుకు పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇటీవల బంగారిగళ్ల కిరణ్‌కుమార్ తదితరులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కొన్నాళ్లక్రితం సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. కానీ ఎలాంటి ప్రత్యామ్నాయచర్యలు కానరాకపోవడంతో బీటీరోడ్డు కలగానే మారడం వలన ఉసూరు మంటున్నారు. హ్యామ్ పద్ధతిలో ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో వీరన్నపేట-చుంచనకోట బీటీ రోడ్డును చేర్చాలని కోరుతున్నారు.



వీరన్నపేట నుంచి చుంచనకోట దారిలో గుంతలు

నిధులు మంజూరుచేయాలి : బంగారిగల్ల కిరణ్, వీరన్నపేట

వీరన్నపేట నుంచి చుంచనకోట వరకు సుమారు 4కిలోమీటర్లమేర మట్టిదారి పాడైపోయి ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో చిత్తడిమయమై కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. వెంటనే బీటీ రోడ్డునిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.



సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

విశ్వకర్మ బోధించిన సూత్రాలను పాటించాలి

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణుల ఆరాధ్య దైవమైన శ్రీ విరాట్ విశ్వకర్మ భగవానుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ బోధించిన సూత్రాలను అందరూ పాటించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా శ్రీ విశ్వకర్మ మహర్షి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ హైమవతి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, సీపీ అనురాధలతో కలిసి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విశ్వకర్మ మహర్షి మనకు కర్మయోగం, శిల్పకళ, నిర్మాణ శాస్త్రం, యాంత్రిక విజ్ఞానానికి ఆది పితామహుడిగా భావించబడతారని తెలిపారు. ప్రతి శిల్పం, యంత్రం, సాంకేతిక పరిజ్ఞానం విశ్వకర్మతోనే మొదలైందని, విశ్వకర్మ మహర్షి నిర్మించిన అద్భుతాలు ఎన్నో మనం శ్రుతి, స్మృతి, పురాణాల్లో చదువుతామని చెప్పారు. పలు చోట్ల సంఘం నాయకులు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలి

గజ్వేల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వామ్యులు కావాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ చెట్లపల్లి బాలకృష్ణ పిలుపునిచ్చారు. ప్రజాపాలన దినోత్సవం నుంచి అక్టోబరు-2 వరకు నిర్వహించనున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నేడు ఆయన ప్రారంభించారు. గజ్వేల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి పాండవుల చెరువు వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం పాండవుల చెరువు వద్ద గల చెత్తను తొలగించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.

సందడిగా కళా ఉత్సవం

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి కళా ఉత్సవం సందడిగా జరిగింది. సిద్దిపేటలోని టీటీసీ భవన్‌లో బుధవారం జిల్లావిద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఇంతకు ముందు మండల స్థాయిలో నిర్వహించిన కళా ఉత్సవంలో గెలుపొందిన విద్యార్థులు ఈ జిల్లా స్థాయి కళా ఉత్సవంలో పాల్గొన్నారు. 12 కేటగిరిల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించినట్లు క్వాలిటి కో ఆర్డినేటర్ ముంద్రాతి రమేష్ తెలిపారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, హర్ట్‌ఫుల్‌నెస్ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో హెల్ప్ అనే కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా మాధక ద్రవ్యాల నిర్మూలన, ధ్యానం, యోగా ప్రాముఖ్యతను విద్యార్థులకు అవగాహన కల్పించారు. వన్‌టౌన్ ఎస్సై నవనీత, కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ దేవయ్య, స్టూడెంట్ కౌన్సిలర్స్ కనకచంద్రం, తహసిన్ ఫాతిమ, హర్ట్‌ఫుల్‌నెస్ జిల్లా కో ఆర్డినేటర్ భారతి పాల్గొని మాట్లాడారు. ధ్యానం వల్ల ఒత్తిడిని అధిగమించవచ్చని, ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు.

ఘనంగా మోదీ పుట్టినరోజు వేడుకలు



తొగుట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసిన బీజేపీ నాయకులు

న్యూస్‌నెట్‌వర్క్,సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి 75వ జన్మదిన వేడుకలను బుధవారం జిల్లాలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రక్తదానం, దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. ఆసుపత్రుల్లో రోగులకు, పాఠశాలల్లో విద్యార్థులకు పండ్లు, పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

అనాథ పిల్లలకు ఆర్థికసాయం

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో భర్త, ఆత్మహత్య చేసుకుని భార్య మరణించిన సంఘటనలో అనాథలైన ఇద్దరు పిల్లలను ఆదుకోవడానికి యువశక్తి యూత్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించారు.

పదోన్నతులు ప్రోత్సాహాన్ని కలిగిస్తాయి

● సీపీ డాక్టర్ బి అనురాధ

సిద్దిపేట క్రైం సెప్టెంబర్ 17(ఆంధ్రజ్యోతి): పదోన్నతులు జీవనశైలిని పెంపొందించే విధంగా ఉంటాయని సీపీ డాక్టర్ బి. అనురాధ అన్నారు. బెజ్జంకి పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ మిర్జా యూనుస్ బేగ్, ఏఎస్సై గా ప్రమోషన్ పొందిన సందర్భంగా ఆయన మర్యాదపూర్వకంగా సీపీని కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సీపీ అభినందించి మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. పోలీసు శాఖలో క్రమశిక్షణతో బాధ్యతగా విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవ మర్యాదలు లభిస్తాయని తెలియజేశారు, సీనియార్టీ ప్రకారం అందరికీ ప్రమోషన్స్ రావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



గజ్వేల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

గజ్వేల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కన్వీనర్ శివలింగ కృష్ణ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మల్లన్నసాగర్ భూనిర్వాసితులతో కలసి ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ భూనిర్వాసితులను నాలుగేళ్ల క్రితం తరలించినప్పుడు ఇంటికి ఇళ్లు, గుడికి గుడి, బడికి బడి అని హామీ ఇచ్చిన అధికారులు ప్రస్తుతం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. నాలుగేళ్లు తమ సమస్యలను పట్టించుకోవడం లేదని, రిజర్వాయర్‌కు భూములు ఇవ్వడమే పాపంగా పరిస్థితి మారిందన్నారు. ఉపాధి, విద్యా, ఉద్యోగ అవకాశాలు లేక భూనిర్వాసితులు ఆగమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 120 మందికి గతంలో అధికారులు 120 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారని, కానీ వారికి స్థలాన్ని(హద్దులను) చూయించడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి హద్దులను చూపించని పక్షంలోనే తామే ఖబ్జాలోకి వెళ్తామని, తమ స్థలాలను సొంతం చేసుకుంటామని హెచ్చరించారు. ఆయనవెంట సీపీఐ నాయకులు, భూనిర్వాసితులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన చెందొద్దు

● డీఏఓ స్వరూప రాణి



జగదేవ్‌పూర్‌లో రైతులతో మాట్లాడుతున్న డీఏవో స్వరూపరాణి

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కోసం ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలు పంపిణీ చేస్తున్న యూరియా కూపన్లు, పీఏసీఎస్, హాకా సెంటర్లలో పంపిణీ చేస్తున్న యూరియా బ్యాగులను డీఏవో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఏవో స్వరూపరాణి మాట్లాడుతూ.. మండలానికి 50 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. యూరియాను దళారులకు కాకుండా రైతులకే కూపన్ల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. మండలానికి విడుతలవారీగా యూరియా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

కొండపాక, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని మర్పడగ విజయదుర్గ సమేత సంతానం మల్లికార్జున స్వామి క్షేత్ర నిర్వాహకుడు దేవి ఉపాసకులు డాక్టర్ చెప్పెల హరినాథ శర్మ అన్నారు. కొండపాక మండల విద్యాశాఖ ఎంఈవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను బుధవారం క్షేత్ర ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఆయన పేర్కొన్నారు. బాల్యం నుంచే పిల్లలకు క్రమశిక్షణ సంస్కారం అందించి దేశానికి మంచి పౌరులుగా అందించే గొప్ప అవకాశం ఉపాధ్యాయులకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరం

దౌల్తాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆపద సమయంలో నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరంగా మారిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పంజా స్వామి అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని గాజులపల్లి గ్రామానికి చెందిన బోయిని నర్సింలుకు మంజూరైన రూ. 24వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రం, ఎల్లం, స్వామి, కరుణాకర్, స్వామియల్, కాంతు, బోయిని నాగులు, రవి, హరీష్, పోచయ్య, ఎల్లం, నర్సింలు, యాదగిరి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట రూరల్,సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులను కాపాడుకునే బాధ్యత మనందరి పైన ఉందని కాంగ్రెస్ పార్టీ మండల మహిళ అధ్యక్షురాలు దాసరి ఉమాదేవి అన్నారు. బుధవారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ.. మండలంలోని ప్రాథమిక పాఠశాలలతో పోల్చుకుంటే జక్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ మంది పిల్లలు ఉండడం వారికి ఉత్తమ ఉపాధ్యాయులు విద్యను అందించడం వల్లే సాధ్యమైందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్దే పెట్టుకుని విద్యాలయాలను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీలేని ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్, నాయకులు పల్లె ప్రశాంత్ గౌడ్, పర్శారాములు, కనకయ్య, శ్రవంతి, శంకరవ్వ, వేణు తదితరులు పాల్గొన్నారు.